క్లుప్తంగా

వర్షం కోసం వరద పాయసం కార్యక్రమం

మాడుగుల రూరల్ : తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వర్షాలు కురవాలని కోరుతూ కె.జె.పురం గ్రామంలో గురువారం వరదపాయసం కార్యక్రమం నిర్వహించారు. కె.జె.పురం మాజీ మునసీబు రాపేట రామకొండ జగన్నాథరావు కళ్లాలు వద్ద కె.జె.పురం గ్రామానికి చెందిన రైతులు మాకుమ్మడిగా వెళ్లి చెట్టు వద్ద పూజలు నిర్వహించి, పాలు మరిగించారు. సహపంక్తి భోజనాలు చేశారు. సర్పంచ్ జామి రమణబాబు, గ్రామస్తులు రాపేట రాజశేఖర్ నాయుడు, జోగినాయుడు, పొలమరశెట్టి కోటీశ్వరావు, బొడ్డేడ సురేష్‌తో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్‌లో గల 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను గురువారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షలో ప్రతిభను చూపి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావాలని ట్రస్ట్ సభ్యుడు బొబ్బిలి సన్యాసిరావు అన్నారు. కార్యక్రమంలో సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ కార్యదర్శి బొంతు మంగపతిరావు, హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

వారపు సంతలో పెరిగిన పైనాపిల్ ధర



మాడుగుల వారపు సంతలో విక్రయిస్తున్న పైనాపిల్ పండ్లు

మాడుగుల రూరల్ : సీజన్ ఆఖరి కావడంతో పైనాపిల్ ధర పెరిగింది. మాడుగులలో గురువారం జరిగిన వారపు సంతలో ఒక్కో పండు ధర రూ.15–16లకు పెరిగింది. దేవాపురం పంచాయతీ శివారు గ్రామాలైన కక్కి, కందిలపాలెం, పులుసుమామిడి, అయినాడ, పంచాయతీ శివారు గ్రామాల నుంచి పైనాపిల్‌ను గిరి రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. రెండు వారాల క్రితం పైనాపిల్ పండు ధర కేవలం రూ. 4లకు విక్రయించారు. ఒకేసారి రేటు పెరగడంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేసారు. అలాగే పనస పండ్లు కూడా గతంలో రూ.50లు ఉండగా, ఈ వారం రూ.100కు విక్రయించారు.

నేడు కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజలు

మాడుగుల రూరల్ : వరలక్ష్మి వ్రతం సందర్భంగా కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపేట రామకొండలరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వరలక్ష్మితల్లికి కుంకుమ పూజలు జరుగుతాయని భక్తులు పూజల్లో పాల్గొనాలని కోరారు.

10న జవహర్ నవోదయ మోడల్ గ్రాండ్‌టెస్టు



కరస్పాండెంట్ వరప్రసాద్

మాడుగుల: ఈ నెల 10 వ తేదీన జవహర్ నవోదయ మోడల్ గ్రాండ్ టెస్టు బుచ్చెయ్యపేట మండలం వడ్డాది అక్షర స్కూల్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని, కరస్పాండెంట్ వరప్రసాద్ తెలిపారు. గురువారం ఘాట్‌రోడ్ జంక్షన్‌లో ఆయన సాక్షితో మాట్లాడారు. ఫలితాలు కూడా అదే రోజు తెలియజేస్తామన్నారు. విద్యార్థుల సామర్థ్యం తెలుసుకోవడానికి 2025–2026 విద్యాసంవత్సరంలో ఈ మోడల్ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష రాయడానికి ఈ నెల 13వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగుస్తుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పాఠశాలలో ముందుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు వాసవీ కన్యకాపరమేశ్వరికి గాజులతో అర్చన

కె.కోటపాడు : కె.కోటపాడులో గల వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం 102 డజన్లు గాజులతో అర్చనను చేయించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా గాజులతో అర్చన చేపడుతున్నట్టు అర్చకులు గోరుగుంతు రమేష్‌బాబు తెలిపారు. ఈ అర్చన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

పేకాట ఆడుతున్న 9 మంది అరెస్టు

రావికమతం : మండలంలో సి.కె.పాడు శివారు జీడితోటల్లో పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్టు కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ గురువారం సాయంత్రం తెలిపారు. గురువారం సాయంత్రం రహస్యంగా పేకాట ఆడుతుండగా, ముందస్తు సమాచారం మేరకు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.37,330 నగదును స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక మేత



శారదానదిలో జి.జగన్నాథపురం వద్ద మల్లంపేట గ్రోయిన్‌కు ఆనుకొని ఇసుక తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ఉచిత ఇసుక ముసుగులో అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నిర్ధారిత ప్రాంతాలను అధికారులు ప్రకటించకపోవడంతో ఇసుక అక్రమ వ్యాపారులు ఎక్కడ పడితే అక్కడే తవ్వేస్తున్నారు. దీని వల్ల నదుల మధ్యలో ఉన్న సాగునీటి కట్టడాలు పూర్తిగా దెబ్బతిని, ఉన్న సాగునీటి వనరులను సైతం ధ్వంసం చేస్తున్నారు.

- ఉచిత ఇసుక ముసుగులో అక్రమంగా తవ్వకాలు
- పేట్రేగిపోతున్న ఇసుక మాఫియా
- సాగునీటి కట్టడాల వద్ద సైతం భారీగా తవ్వకాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



దెబ్బతిన్న గ్రోయిన్ రాతిగట్టు

చోడవరం: గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడి ఇసుక తవ్వకాలను, రవాణాను అరికట్టగా కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కడ పడితే అక్కడ ఇసుక దోపిడీ జరుగుతుంది. ఈ తవ్వకాలను అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో పలు నదుల్లో ఉన్న గ్రోయిన్లు, స్లూయిస్‌లు, వంతెనలు, దెబ్బతింటున్నాయి. చోడవరం, కె.కోటపాడు, దేవరాపల్లి, మాడుగుల, బుచ్చెయ్యపేట, చీడికాడ మండలాల్లో అనేక చోట్ల కట్టడాలు దెబ్బతిన్నాయి. గవరవరం, గౌరీపట్నం, జి.జగన్నాథపురం, మల్లంపాలెం, గజపతినగరం, గోవాడ, ముద్దుర్తి, చాకిపల్లి, బెన్నవోలు, విజయరామరాజుపేట, వడ్డాది, లక్కవరం, బోయిల కింతాడ, తుమ్మపాల, కోరింకోట, జంపాలెంతోపాటు పలు ప్రదేశాల్లో ఉన్న గ్రోయిన్లు, వంతెనలు, స్లూయిస్ వద్ద సైతం తవ్వకాలు చేస్తున్నారు. జి.జగన్నాథపురం వద్ద శారదానదిలో గ్రోయిన్‌కు ఆనుకొనే ఇసుక తవ్వకాలు చేయడంతో గ్రామస్తులు పలుమార్లు అడ్డుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికే నదుల్లో గ్రోయిన్లు పూర్తిగా దెబ్బతిని ఉండగా ఇప్పుడు జరుగుతున్న ఇసుక తవ్వకాలతో ఇక పూర్తిగా రాతి కట్టడాలు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. వేలాది ఎకరాలు ఈ గ్రోయిన్లు, స్లూయిస్‌లు, ఆనకట్టల కింద ఆధారపడి పంటలు సాగు జరుగుతున్నాయి. అసలే కొన్నేళ్లుగా మరమ్మతులు చేయక అన్ని గ్రోయిన్లు దెబ్బతిని ఉండగా ఇప్పుడేమో ఇసుక తవ్వకాల వల్ల అవి మరింత దెబ్బతిని సాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదం ఏర్పడింది.

అధికార పార్టీ నేతల అండతోనే...

ఇసుక వ్యాపారులకు అధికార పార్టీ నాయకులతో పాటు కొందరు అధికారులు కూడా మద్దతు ఇవ్వడం వల్లే విచ్చలవిడిగా ఎక్కడపడితే అక్కడ ఇసుక తవ్వేస్తూ కట్టడాలు ధ్వంసం చేస్తున్నారని ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి అడ్డుకట్ట వేయకపోతే మరింత ప్రమాదం పొంచివుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను అధికారులు గుర్తించి అక్కడ నుంచే ఇసుక నిబంధనల మేర తరలించేలా చర్యలు తీసుకోవాలని, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిఘా పెంచుతాం : తహసీల్దార్

ఇసుక ఉన్న ప్రదేశాల నుంచే నదిలో కట్టడాలు దెబ్బతినకుండా నిబంధనలు మేర 300 మీటర్ల దూరంలోపు ఇసుక తవ్వితే చర్యలు తీసుకుంటామని చోడవరం తహసీల్దార్ రామారావు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంతెనలు, గ్రోయిన్లు, స్లూయిస్‌లు ఉన్న దగ్గర ఇసుక తవ్వకాలపై నిఘా పెంచుతామన్నారు. అక్రమ ఇసుక రవాణాపై ఇప్పటికే దాడులు చేస్తున్నామన్నామని తెలిపారు.

మార్కెట్లో కానరాని శ్రావణశోభ



మాడుగులలో సందడి లేని మార్కెట్



ఘాట్‌రోడ్ జంక్షన్‌లో వెలవెల బోతున్న పండ్ల దుకాణం

మాడుగుల : హిందువుల పర్వదినం వరలక్ష్మీ దేవి వ్రతం శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించే వరలక్ష్మీ దేవి వ్రతానికి ముందుగా బంగారు కాసులతో పాటు పండ్లు, పూలు, కూరగాయలు, కొబ్బరికాయలతో పాటు ఇతర సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది వర్షాలు అనుకూలించక ఖరీఫ్ వరి నాట్లు వేసుకో లేక పోవడంతో రైతులు ఈ వ్రతంపై దృష్టి సారించలేదు. మాడుగుల, ఘాట్‌రోడ్ మార్కెట్లు కొనుగోలుదారులు అంతగా రాకపోవడంతో దుకాణాలన్నీ బోసి పోయాయి. ఈ ఏడాది కొనుగోలు దారులు అంతగా రాలేదని వ్యాపారులు చెబుతున్నారు.

స్వయంభూ విఘ్నేశ్వరుని ఉత్సవాలకు ఘనంగా ఉత్సవ రాట



చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉత్సవరాట వేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం : పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లాంఛనంగా వేసే ఉత్సవ రాటను ఆలయ ప్రాంగణంలో గురువారం వేశారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ఈ వేడుకల్లో పాల్గొని ఉత్సవరాటను ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రాలు, ప్రత్యేక పూజ చేసి వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాణిపాకం అంతటి ప్రసిద్ధిగాంచిన చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నామన్నారు. ఇప్పటికే ఆలయానికి రాజగోపురాల నిర్మాణంతో కొత్త శోభ వచ్చిందని, కొత్తగా మాడవీధులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. మాడవీధుల్లో ఊరేగింపు జరిపేందుకు సీసీ రోడ్లు కూడా వేస్తున్నామన్నారు. ఆలయ ఆవరణంలోనే గతంలో ఎప్పుడూలేని విధంగా 63 అడుగుల ఎత్తయిన మట్టి విగ్రహాన్ని ఏర్పాటుచేసి నవరాత్రి ఉత్సవాల్లో సరికొత్త రీతిలో అంగరంగ వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వచ్చే నెల 27వ తేదీన వినాయక చవితి కావడంతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ముందుగా ఉత్సవ రాట వేసి నవరాత్రి ఉత్సవాల పనులన్నీ ప్రారంభిస్తామన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని ధర్మశ్రీ చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పసుమర్తి సాంబ, దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.వి.వి సత్యనారాయణమూర్తి, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కనిశెట్టి మచ్చిరాజు, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, పట్టణ అధ్యక్షుడు చిన్న పాల్గొన్నారు.

నాతవరంలో దంచి కొట్టిన వర్షం



నాతవరం మెయిన్‌రోడ్డుపై నీటి ప్రవాహం



ఎంపీడీవో కార్యాలయం వద్ద నీరు



పోలీసుస్టేషన్ ఎదుట విరిగిన చెట్టు

నాతవరం : మండలంలో గురువారం ఈదురు గాలలతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ కాచి మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. ఈ వర్షంతో నాతవరం గ్రామంలో వీధులు జలమయం అయ్యాయి. మెయిన్‌రోడ్డుపై నీటి ప్రవాహంతో వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురు గాలులకు పోలీసుస్టేషన్ ముందు చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం కారణంగా ఎంపీడీవో కార్యాలయం చుట్టు ద్వీపకల్పంలా నీరు చేరడంతో బయటకు రావడానికి అధికారులు ఇబ్బంది పడ్డారు. అదే విధంగా వెలుగు విద్యాశాఖ తహసీల్దార్ కార్యాలయాలు ప్రాంగణమంతా నీటి మయంగా కావడంతో ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో ఎండిపోతున్న వరి నారుమడులకు జీవం పోసినట్టయిందని రైతులు తెలిపారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఎంపీడీవో మేరీరోజ్, గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరి, ఎంఈవో సత్యన్నారాయణ తెలిపారు. గొలుగొండలో తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తల్లిపాల వల్ల బిడ్డకు ఎంతో మేలు జరుగుతుందని ఈ విషయం ప్రతి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ముగింపు సందర్భంగా గర్భిణులకు సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

తల్లిపాలలో అధిక పోషక విలువలు

కె.కోటపాడు : బిడ్డ జన్మించిన తరువాత తప్పనిసరిగా తల్లిపాలను అందించాలని కె.కోటపాడు ఐసీడీఎస్ పీవో లలితకుమారి అన్నారు. తల్లిపాలలో అధిక పోషక విలువలు ఉండడం వల్ల బిడ్డకు వ్యాధులు త్వరితగతిన సోకకుండా మంచి ఆరోగ్యం లభిస్తుందని ఆమె అన్నారు. కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తల్లిపాల ద్వారానే బిడ్డకు మొదటి వ్యాక్సినేషన్ అందుతుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.కుమారి పాల్గొన్నారు.

13న విజయాంజనేయ విగ్రహ ప్రతిష్ట



మాడుగులలో విగ్రహ ప్రతిష్టకు సిద్ధంగా విజయాంజనేయ ఆలయం

మాడుగుల : ఈ నెల 13 వ తేదీన విజయాంజనేయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరగనుందని, ఆలయ నిర్వాహకులు రాఖి శ్రీనుతో పాటు ఇతర సభ్యులు తెలిపారు. అదే రోజు ఆలయ గోపుర కలశ ప్రతిష్ట జరగనుందన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. భక్తులు స్వామివారికి కల్యాణోత్సవంలో పాల్గొని తరించాలని కమిటీ కోరుతోంది.

కొండెక్కిన పూలు, పండ్ల ధరలు

చోడవరం : శ్రావణ మాసం వరలక్ష్మీదేవి పూజకు కొనుగోలు, అమ్మకాలతో గురువారం సందడి నెలకొంది. పండ్లు, పూలు, వస్త్రాలు, బంగారం కొనుగోలు అమ్మకాలతో అంతా హడావిడి నెలకొంది. చోడవరం కొత్తూరు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్, చినబజార్ వీధులు జనంతో రద్దీగా మారాయి. అయితే పండ్లు, పువ్వుల ధరలు ఆకాశాన్నంటాయి. సాధారణ రోజుల్లో అరడజను యాపిల్స్ రూ.80 అమ్మితే ఇప్పుడు రూ.120కిపైనే అమ్మారు. ద్రాక్ష కిలో రూ.100, బత్తాయిపండ్లు డజను రూ.110, దానిమ్మపండ్లు అరడజను రూ.100 విక్రయించారు. ఇక 10 చామంతి పువ్వులు రూ.30 చొప్పున విక్రయించారు. అలాగే చీరలు, లక్ష్మీదేవి బంగారు రూపులు, లక్ష్మీదేవి ఫొటో ఫ్రేమ్‌లు భారీగా కొనుగోలు చేశారు. మరో వైపు లక్ష్మీదేవి పూజను పురస్కరించుకొని చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి, దుర్గాదేవి, గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. దర్శనాలకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం : మండల కేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ నర్సీపట్నం ఈఈ అప్పారావు గురువారం తెలిపారు. మాకవరపాలెంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి సరఫరాకు అంతరాయం లేకుండా చెట్ల కొమ్మలు తొలగించనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, రాజారావుపేట, కింది వీధి, కొత్తవీధి ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

అవంతి విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఛైర్మన్ శ్రీనివాసరావు



హాజరైన నూతన విద్యార్థులు

మాకవరపాలెం : విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాసరావు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నూతనంగా చేరిన విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యలో మెలుకువలు, సాంకేతిక పరిజ్ఞానం, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కష్టపడి కాకుండా ఇష్టపడి చదివిననాడే విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ పళ్లంశెట్టి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలంటే ప్రయోగశాలను పూర్తిగా వినియోగించుకోవాలన్నారు. విశాఖ డిజిఫక్ మేనేజింగ్ డైరెక్టర్ అమల్‌రాజ్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ ద్వారా అనుభవం సంపాదిస్తే ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. బ్రహ్మకుమారీస్ సోదరి శృతి మాట్లాడుతూ పనిలో ఏకాగ్రత ఉండాలని, మేధాశక్తిని మెరుగు పరుచుకోవడానికి ఆధ్యాత్మికత, ధ్యానం అవసరమన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సి.మోహన్‌రావు, ప్లేస్‌మెంట్స్ డీన్ టి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధిపతులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల ఏవో డానియల్‌రాజ్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టరు విడుదల చేస్తున్న జెడ్పీటీసీ అప్పలనర్స

నాతవరం: మండల కేంద్రంలో గురువారం జాతీయ నులిపురుగులు నివారణ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాతవరం పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి ప్రసన్న మాట్లాడుతూ చిన్నారులు, విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రం వేయడం వల్ల ఆరోగ్య వంతంగా ఉంటారన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ మాత్రలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి పోలుపర్తి పార్థసారథి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ సందర్శిస్తానంటే అనుమతించలేదు

- రిపబ్లికన్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి లోవచంద్

కె.కోటపాడు: ఎ.కోడూరు సాంఘిక సంక్షేమశాఖకు చెందిన సమీకృత వసతిగృహంలో సమస్యలు తెలుసుకునేందుకు గురువారం వెళితే తనను లోనికి అనుమతించలేదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా ఇన్‌చార్జ్ లోవచంద్ పేర్కొన్నారు. వసతిగృహంలో ఉండాల్సిన వార్డెన్ రమణ పరీక్షలకు వెళ్లిన సమయంలో లేరని, బిల్లులు పెట్టేందుకు అనకాపల్లి వెళ్లారని వాచ్‌మన్ చెప్పినట్టు తెలిపారు. మెను పాటించడం లేదని, వార్డెన్ అందుబాటులో ఉండడం లేదని, హాస్టల్ విద్యార్థులు తనతో చెప్పారని లోవచంద్ తెలిపారు.


జేబీపురంలో తాగునీటి ఇక్కట్లు..



నిరుపయోగంగా మోటారు షెడ్డు

చీడికాడ : మండలంలో జేబీపురంలో గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా, తాగునీటి కోసం రెండు బోరు మోటారు షెడ్లు, సంబంధిత గుత్తేదారు తొమ్మిది మాసాల క్రితం నిర్మించారు. అయితే ఆ మోటారు షెడ్లకు విద్యుత్ సిబ్బంది వారు ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు చెయ్యకపోవడంతో బోరు షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయని, దీని వల్ల గ్రామంలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ధర్మిశెట్టి స్వాతి, గ్రామస్తులు విద్యుత్ ఏఈకి విజ్ఞప్తి చేసినా స్పందించలేదని తెలి పారు. గ్రామస్తుల దాహార్తిని తీర్చాలని కోరారు.

లింగ నిర్ధారిత వీర్యం ప్రయోజనాలను రైతులకు వివరించాలి



దేవరాపల్లి పశువైద్య శాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీ దినేష్‌కుమార్

దేవరాపల్లి: లింగ నిర్ధారిత వీర్యం లభ్యత, ప్రయోజనాలకు పాడి రైతులకు సమగ్రంగా వివరించాలని కె.కోటపాడు పశు సంవర్ధకశాఖ ఏడీ ఇ. దినేష్‌కుమార్ పశువైద్య సిబ్బందికి సూచించారు. ఈమేరకు మండలంలో దేవరాపల్లి, మామిడిపల్లి, వేచలం, కొత్తపెంట పశువైద్య శాలలను గురువారం ఆయన అకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి మందుల నిల్వలను పరిశీలించారు. పశువులకు అందిస్తున్న సేవలపై స్థానిక రైతులను ఆరా తీశారు. పశుపోషకుల సమగ్ర ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం నిర్వహిస్తున్న బ్లాంకెట్ సర్వేను ఆయన పర్యవేక్షించారు. దేవరాపల్లి పశువైద్యాధికారి గాయిత్రీదేవి, మామిడిపల్లి పశువైద్యాధికారి ప్రియాంక పాల్గొన్నారు.

జీవోపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తాం



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనకాపల్లి: పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలను నిషేధిస్తూ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. బాబ్జి, జి. ఫణీంద్ర కుమార్ తెలిపారు.

స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉత్తర్వులను దహనం చేసి, విద్యార్థుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యారంగంలో అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్యలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకులవేనని చైతన్య, నారాయణ, భాష్యం పాఠశాలల ఫీజుల దోపిడీని, పుస్తకాలను అధిక ధరలు అమ్ముకోవడానికీ, విద్యను వ్యాపారం చేసుకోవడానికి మేలు కోసమే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దివ్య, సంధ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తూటిపాలలో ముందస్తు రాఖీ పండగ



రాఖీలు కడుతున్న విద్యార్థినులు

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ముందస్తు రాఖీ పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులతో హరిత రాఖీలు కట్టించి ఒకరికి ఒకరు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు రాము, సుధామాధవి, లోవరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయి నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు కొబ్బరి ఆకులతో తయారు చేసిన రాఖీలను కట్టించామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం, పాయకరావుపేట : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com